మంచాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు శాస్త్ర సాంకేతికతను వినియోగించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కేవీ.రావు, గిరిరాజ్ అమర్‌నాథ్‌లు రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, నీటి నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మంచాలలో సుఖరక్షక ఏఐ ఫీల్డ్ కన్సల్టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల అంచనా, ఏఐ ఆధారిత సలహాలు, సాగులో సమయానుకూల ప్రాముఖ్యంలపై వివరణాత్మక ప్రదర్శన ఏర్పాటుచేశారు. రైతుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాస్త్రవేత్తలు చంద్రకాంత్, ఎస్.విజయ్‌కుమార్, డి.సుధీర్, శ్రీకృష్ణ, ఏవో శ్రీలత, ఏఈవోలు లింగస్వామి, నిఖిత పాల్గొన్నారు.

గణేశ్ చవితిని శాంతియుతంగా జరుపుకోవాలి

శామీర్‌పేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వినాయక మండప నిర్వాహకులకు సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు దశరథ, శశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు



తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి బోనాలు సమర్పించారు. రావిర్యాల, సర్దార్‌నగర్, తుక్కుగూడ, మంఖాల్, హర్షగూడ, ఆదిభట్ల, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, ఇమాంగూడ, శ్రీనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలొచ్చి ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో అమ్మవారి కల్యాణోత్సవం, ఘటాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, వీఐపీల సందడితో వైభవంగా కొనసాగాయి. ఎమ్మెల్యేలు సబితారెడ్డి, మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు అమ్మ వారికి పూజలు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. వీఐపీలకు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిగల్ల రత్నం శాలువాలతో సత్కరించారు.

మహేశ్వరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)



ఆలయంలో కొలువు దీరిన ఎల్లమ్మ తల్లి



పూజలకు హాజరైన ఎమ్మెల్యేలు సబితారెడ్డి, మల్లారెడ్డి

హిందూ ఉత్సవ కేంద్ర సమితి పూర్తి స్థాయి కార్యవర్గం

తాండూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. హైదరాబాద్ రోడ్డు మార్గంలోని హిందూ ఉత్సవ సమితి స్థలం వద్ద ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా తర్లపల్లి భానుకుమార్, గొలి పరమేశ్, మణపురం రామకృష్ణ, బాతుల నాగరాజు, డి.శ్రీకాంత్‌రెడ్డి, అల్లాపురం శ్రీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, అంతారం రమేశ్, కొటం ప్రసాద్, సహ కార్యదర్శిగా పడమటి వెంకటేశం, అశోక్, కోట్ల రాజ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, హరి ప్రసాద్‌గౌడ్, లోకేశ్, సందీప్‌రెడ్డి, రజక నర్సింహా, వడ్డె పరమేశ్, అధికార ప్రతినిధిగా పర్యాద రామకృష్ణలను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా బోయ రాజు, అనిల్ గౌడ్, గోపాల్ చౌహాన్, సాంస్కృతిక కార్యదర్శులుగా దావులయ్య, తట్టేపల్లి నరేశ్, రమేశ్, సమన్వయ కమిటీ సభ్యులుగా జుంటుపల్లి వెంకట్, సురేశ్‌నాయక్, ఎస్.వెంకటేశ్, దివిటి ఎల్లప్ప, బీజే దత్తు, ప్రవీణ్, మధు, వసంత్, ప్రచార కార్యదర్శులుగా తాండ్ర నరేశ్, గోపాల్, న్యాయ సలహాదారులుగా పాశం రవికుమార్, మిస్కిన్ దేవరాజ్, ఆధ్యాత్మిక సలహాదారులుగా మడపతి సిద్ధిలింగయ్య ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు స్వప్నపరిమళ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ బాధితులకు పరిహారం చెల్లించండి

సీఎంను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఆయన మంగళవారం ఆయన నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. పరిహారం చెల్లించకపోవడంతో పనులు జరగడం లేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నష్ట పరిహారంగా రూ.25 కోట్లు తక్షణం విడుదల చేయాలని ఆయన కోరినట్లు తెలిపారు. అలాగే కాగ్నా నదిలో ఉన్న తాగు నీటి పైపులైన్ పునరుద్ధరణ కోసం రూ.50 కోట్లు మంజూరు చేయాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



ఎస్ఆర్ రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గ్రంథాలయ దినోత్సం సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ రామదాసు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ పాలకుడు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు.

చదివితేనే భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాధికాగుప్తా

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం ఆమె మేడ్చల్ సమీప కిష్టాపూర్‌లోని గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వంట గదులను, తరగతి గదుల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ... బాగా చదివి ఆశయాన్ని సాధించాలన్నారు. గురుకులాల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. చదువులో వెనకపడకుండా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఎప్పటికప్పుడు సాధన చేసి పరీక్షల్లో బాగారాసి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. విద్యార్థులు తెలిపిన పలు సమస్యలపై టీచర్లకు సూచనలు చేశారు. ఆమె వెంట అధికారి వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాకు నేడు, రేపు
ఆరెంజ్ హెచ్చరికలు

- అక్కడక్కడ భారీ వర్షాలు
- బేగంపేట వాతావరణ శాఖ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు మంగళవారం హెచ్చరికలు జారీచేశారు. బుధ, గురువారాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలుంటాయన్నారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీచేసింది. ఉపరితల గాలులు వాయువ్య దిశలో గంటకు 6-8 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

మిర్జాపూర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

పూడూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జాపూర్‌లో మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ స్థానికుల అభిప్రాయాన్ని సేకరించారు. ఆయన మాట్లాడుతూ.. మిర్జాపూర్‌లోని సర్వే నంబర్.17/ఇ, 17/ఎ, 17ఇఇ/1/1లలో రెక్జిన్ తయారీకి మెస్సర్ సుందర్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయదలిచిందన్నారు. అయితే ఫ్యాక్టరీ ఏర్పాటును కొందరు వ్యతిరేకిస్తున్నారని, అందుకే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని తెలిపారు. ప్రజాభిప్రాయ నివేదికను తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి పంపిస్తామని తెలిపారు. గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో వాసుచంద్రలను కలిసి ఫ్యాక్టరీ పెడితే పంట నష్టంతోపాటు, చుట్టుపక్కల కాలుష్యంతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఫ్యాక్టరీ ఏర్పాటు యోచనను విరమించుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. రెండు రోజులపాటు పోలీసు బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌కుమార్, ఫ్యాక్టరీ జీఎం మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజాసేవకే రాజకీయాల్లోకొచ్చా

- కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు తనకు ఎన్నికల్లో 70వేల ఓట్లు వేసి ఆదరించారని చెబుతున్న బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారికి ఈ ప్రాంత అభివృద్ధిపై బాధ్యత లేదా? అని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రశ్నించారు. ఆమనగల్లులోని కల్యాణి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకొచ్చానన్నారు. తనకు ఎవరిపైనా ఈర్ష్యా, ద్వేషాలు లేవని చెప్పారు. ఆమనగల్లులో బీజేపీ ధర్నాలో ఆచారి.. తనను, సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి సంస్కారం లేకుండా ఏకవచనంతో మాట్లాడటం పద్ధతి కాదన్నారు. తామిద్దరం ఒకే పాఠశాలలో చదువుకున్నామని, తమ గురువులు ఒక్కరేనని.. ఆచారి మాత్రం సంస్కారహీనంగా మాట్లాడారని విమర్శించారు. తామేం చేస్తున్నామో తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. సీఎం సహకారంతో రోడ్ల అభివృద్ధికి రూ.600కోట్లు సాధించానని చెప్పారు. జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు వెడల్పునకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు నిర్వహిస్తామన్నారు. అభివృద్ధి విషయంలో ఆచారి కలసిరావాలని, కేంద్ర నిధుల సాధనకు తన బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే హితువు పలికారు. ఆయన ఇంటీరియల్ రోడ్లకు రూ.వెయ్యి కోట్లు, హైదరాబాద్-శ్రీశైలం హైవే ఆరు లేన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వ నిధులు తెస్తే ఎయిర్ పోర్టులోనే ఘనస్వాగతం పలుకుతామని నారాయణరెడ్డి అన్నారు. సీఎం, ఎమ్మెల్యేను కించపరుస్తూ మాట్లాడిన ఆచారి క్షమాపణ చెప్పాలని పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కేశవులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికారప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, వెంకటేశ్వర్లుగౌడ్, అనంతరెడ్డి, జగన్, మానయ్య, శ్రీనివాస్‌గౌడ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, కాలె మల్లయ్య, అంజన్‌రెడ్డి, కృష్ణానాయక్, అలీం, ఖాదర్ ఖాద్రి, మైసయ్య, దళపతిగౌడ్, బాబ, జగన్, శివలింగం, బల్‌రామ్, మహేశ్, టి.రవీందర్ పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుండొద్దు : ఎమ్మెల్యే

పరిగి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూడూరు, దోమ, పరిగి, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లో ఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ రవిప్రసాద్, డీఈఈ సంజీవ్, ఏడీఈ వెంకటనాయుడు, ఏఈలు హరికృష్ణ, వినయ్‌కాంత్, మోతీలాల్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దోమ: ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాకొండకు చెందిన మజ్జిగ శివకుమార్‌కు వైద్యం కోసం మంజూరైన రూ.2.5లక్షల చెక్కును స్థానిక నాయకులతో కలిసి కుటుంబీకులకు అందజేశారు. లాల్‌కృష్ణ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు తోడ్పాటు

కందుకూరు,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు గోరుటి ఈశ్వర ట్రస్ట్ తోడ్పాటును అందిస్తుందని బాధ్యులు బూచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, పి.తిరుపతిరెడ్డి, జయచంద్రారెడ్డిలు అన్నారు. ఆకుల మైలారం పాఠశాలలో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని రోజాకు మంగళవారం రూ.15వేల చెక్కును అందజేశారు. తమ ట్రస్ట్ ద్వారా 15ఏళ్లుగా ఆకులమైలారం పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతిని ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు డి.రామకృష్ణారెడ్డి, హెచ్‌ఎం వనజకుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ బీబీఏ ప్రోగ్రాం డైరెక్టర్ శివప్రియ అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీన్ బాలాజీ ఉట్ల, సలహాదారు పీఎస్ఎస్ మూర్తి, విష్ణుచందన, మహిపతి శ్రీనివాస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

చావడానికైనా సిద్ధం.. పొలాలివ్వం

ఆర్డీవోకు కడ్తాల్ మండల రైతుల మొర

కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తమ భూములను కాపాడుకునేందుకు చావడానికైనా సిద్ధమని, కానీ హైటెన్షన్ లైన్‌కు భూములు ఇవ్వం అని కడ్తాల్ మండలంలోని పలు గ్రామాల రైతులు అన్నారు. మండల పరిధి గ్రామాల నుంచి పోతున్న హైటెన్షన్ లైన్‌ను రద్దు చేయాలని వారు మంగళవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీదర్ నుంచి మహేశ్వరం పవర్ గ్రిడ్(మీర్కాన్‌పేట) వరకు 765కేవీ హైటెన్షన్ లైన్‌ను మంజూరు చేసిందని, కాంట్రాక్టర్ సమాచారం ఇవ్వకుండానే తమ పొలాల్లో హైటెన్షన్ స్తంభాలను పాతడం ఏమిటని రైతులన్నారు. దీంతో ఆర్డీవో స్పందించి రైతులు, హైటెన్షన్ లైన్ పనుల కాంట్రాక్టర్‌తో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గెజిట్ ఆఫ్ ఇండియా ప్రకారం ఒక ప్రాజెక్టును ప్రారంభించాలంటే స్థానికుల ఆమోదం, పంచాయతీ తీర్మానం, అధికారుల ఆమోదంతో పనులు చేయాలని, కానీ కాంట్రాక్టర్ అవేమీ పాటించడం లేదని రైతులు మొరపెట్టుకున్నారు. పవర్‌గ్రిడ్ అధికారులు ఆర్డీవో, కలెక్టర్‌కు తప్పుడు సమాచారమిచ్చి తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో కడ్తాల్ మాజీ సర్పంచ్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కె.రామకృష్ణ, యువజన సంఘాల అధ్యక్షుడు ఎ.రాఘవేందర్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పి.వెంకటేష్, రైతులు శివరామకృష్ణ, పర్వత్‌కుమార్, పెంటారెడ్డి, జి.కృష్ణ, అభిషేక్‌రెడ్డి, జి.రాజేందర్‌యాదవ్, మహేష్, కేశవులు గౌడ్, కుమార్, కె.సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

వికారాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కేవలం 32శాతం మాత్రమే అమలవుతోందని సాధన ఎన్జీవో డైరెక్టర్ చిక్కు మురళీమోహన్ అన్నారు. మంగళవారం డైట్ కళాశాలలో బాలల హక్కులు, విద్యా సామర్థ్యాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, చట్టం పటిష్ఠ అమలుకు పంచవర్ష ప్రణాళిక, బాలలపై సమగ్ర సర్వే, ప్రాథమిక, మాధ్యమిక విద్యకు 10శాతం బడ్జెట్ నిధుల కేటాయింపు అవసరమన్నారు. 18ఏళ్లలోపు అందరికీ ఉచిత, నిర్బంధ విద్య అందేలా చట్ట సవరణ చేయాలని చెప్పారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, పిల్లలు లేరనే సాకుతో సర్కారు బడుల మూసివేతలను ఆపాలని కోరారు. 3 నుంచి 9 తరగతుల విద్యార్థులకు రెమీడియల్ టీచింగ్, ఉపాధ్యాయులకు స్వయంప్రతిపత్తి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్‌యాదవ్, ఎహెచ్‌టీయూ హెడ్‌కానిస్టేబుల్ అలీమొద్దీన్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నర్సింహులు, సఖీ సెంటర్ కో-ఆర్డినేటర్ యశోద, లీగల్ కౌన్సిలర్ సుమలత, షీ టీం ప్రతినిధి రేష్మ, డైట్ సూపరింటెండెంట్ హస్సేన్ సయ్యద్, ధారూర్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి, సంస్థ ప్రతినిధులు అంజయ్య, ఆసీమ, రోజా, ప్రకాశ్ పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న సాధన కమిటీ

సీఎం సహాయనిధి పేదలకు వరం


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి గొప్ప వరమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అలియాబాద్‌కు చెందిన గూడె బాలమణి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతుండగా ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.25,500 చెక్కును ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు సరసం మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దుద్యాల: చెట్టుపల్లి తండాకు చెందిన చవాన్ విఠల్‌నాయక్‌కు మంజూరైన రూ.50వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్ మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావ సభకు తరలిన నాయకులు


ముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావ సభలో నాయకులు

దుద్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావ సభ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి కొడంగల్ నియోజకవర్గంలోని ముదిరాజ్ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మడిగె శ్రీను, బొంబాయి రాములు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు


అడ్కిచర్లలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెద్దేముల్, ఆగస్టు 12(ఆంధ్ర జ్యోతి): ప్రజలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయొద్దని డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. అడ్కిచర్ల సబ్‌సెంటర్‌లో టీబీముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తపోటు, హెచ్ఐవీ, మధుమేహం, డయాలసిస్, క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. టీబీలక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఎక్స్‌రేకు తాండూరు జిల్లా ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రసూల్, సూపర్‌వైజర్ సుగుణ, ఎంపీహెచ్ఏ హరిశంకర్, స్వరూప, సావిత్రిబాయి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఏలను నియమించుకోవాలి


రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్ఏలను నియమించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. నూతన ఓటరు నమోదుపై యువతీ, యువకులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాజకీయ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

ధారూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు, 420 హామీల ఆశచూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డిలు ఆరోపించారు. గట్టేపల్లిలో మంగళవారం రుద్రారం, రాంపూర్ గ్రామాల పార్టీ నాయకులతో వారు సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సంతోష్, రాములు, దేవేందర్, చంద్రమౌళి, హఫీజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ అధ్యాపకుడు లేక ఇబ్బందులు

కులకచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 26, బైపీసీలో 22 మంది, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ 24, బైపీసీలో 15మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల ప్రారంభమై 45రోజులు గడుస్తున్నా కెమిస్ట్రీ అధ్యాపకుడి నియామకం కాలేదు. దీంతో విద్యార్థులు ప్రొజెక్టర్ ద్వారా ఆన్‌లైన్ పాఠాలు వింటున్నారు. అధికారులు స్పందించి కెమిస్ట్రీ అధ్యాపకుడిని నియమించాలని కోరారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పోచారం మున్సిపాలిటీలో జాతీయ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో పోచారం, అన్నోజిగూడ, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ గిరిజన మోర్చా నాయకుడు నానావత్ బిక్కునాద్‌నాయ్, సురేష్‌నాయక్, గొంగళ్ల బాలేష్, రాజారమేశ్ పాల్గొన్నారు.

కీసర: ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా జెండా ర్యాలీ కార్యక్రమం కీసర ప్రధాన చౌరస్తాలో ఘనంగా జరిగింది. స్ఫూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు 500 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు.

మత్స్యశాఖ చైర్మన్‌ను కలిసిన మాజీ వైస్‌ఎంపీపీ

పరిగి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను మంగళవారం నగరంలోని ఆయన కార్యాలయంలో పరిగి మాజీ వైస్‌ఎంపీపీ కావలి సత్యనారాయణ కలిశారు. చైర్మన్ సాయిని ఆయన శాలువాతో సన్మానించారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. చెరువుల్లో పూర్తిస్థాయి నీరు చేరిందని, అయితే చేపపిల్లలు ఇప్పటి వరకు వదలలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాయితీ చేపపిల్లను సరఫరా చేయాలని కోరారు.

ఉధృతంగా మూసీ ప్రవాహం


ఎదులాబాద్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. చెరువులు, కుంటలు, వాగులు నిండాయి. చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లొద్దని పోలీసులు బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు నిండుకుండలా కనిస్తోంది.

నేలకొరిగిన భారీ వృక్షం

- తప్పిన ప్రమాదం


ఒరిగిపడిపోయిన మర్రిచెట్టు

పరిగి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కొడంగల్ చౌరస్తా కేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌కు వెళ్లేదారిలో రోడ్డు పక్కన ఉన్న భారీ మర్రి చెట్టు మంగళవారం ఉదయం నేలకొరిగింది. మర్రి చెట్టు దగ్గరే టిఫిన్ సెంటర్ ఉండగా చెట్టుపడిన శబ్దంతో స్థానికులు పరుగులుతీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. వృక్షం పడటంతో టిఫిన్ సెంటర్‌కు సంబంధించి రేకులషెడ్ కూలిపోగా, విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, విద్యుత్ శాఖలు అధికారులు దగ్గరుండి మర్రిచెట్టును తొలగించారు. విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వాగు.. దాటితేనే సాగు

(ఐదో పేజీ తరువాయి)

వాగుల రైతులు చుట్టూ తిరిగి ఐదారు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిందే. దాదాపుగా 500 ఎకరాల పొలాలు, 80 కుటుంబాల రైతులు ఏళ్లుగా ఈ కష్టాలు పడుతున్నారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో పొలాల్లో ఎరువులు చల్లడం, ధాన్యం తీసుకరావడం, పశువులకు మేత తీసుకరావడానికి పడే కష్టాలు అన్నీఇన్నీ కావు.

ప్రతీ ఏడాది ఇదే తంతు

రెండు వాగులపై వంతెనను నిర్మించాలని రైతులు పలుమార్లు ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వారు నీటిలో అంతా దూరం వెళ్లలేక వెదురు బొందులతో సొంతంగా ప్రతీ సంవత్సరం తాత్కాలిక వంతెన నిర్మించుకుంటున్నారు. ఇలా ఏడెనిమిదేళ్లుగా రైతులు వారు నిర్మించుకున్న వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన సీజన్ వరకే ఉంటుండటంతో ప్రతీ ఏడాది వెదురు బొంగులతో వంతెన నిర్మించుకోవాల్సిన పరిస్థితి. ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాలకు పొలాల దగ్గర వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులంతా చందాలు వేసుకొని సోమ, మంగళవారం నుంచి తాత్కాలిక వంతెన నిర్మించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇసుక బస్తాలు, సిమెంట్ స్తంభాలు, వెదురుబొంగులతో పనులు సాగిస్తున్నారు. ఈ తాత్కాలిక వంతెనను నిర్మించుకునేందుకు రూ.లక్ష వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పక్కా వంతెనను నిర్మించి రైతుల కష్టాలను తీర్చాలని చిగురాల్‌పల్లి రైతులు కోరుతున్నారు.

త్వరలో వంతెన పనులు ప్రారంభిస్తాం



చిగురాల్‌పల్లిలో వాగుపై బిడ్జి నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరూ చేస్తూ ఇటీవల ప్రొసిడింగ్ ఇచ్చాం. పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించాం. వర్షాల కారణంగా పనులు ప్రారంభం ఆలస్యం అవుతున్నాయి. రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి నిధులు మంజూరు చేయించాను. త్వరలోనే ఈ పనులు ప్రారంభించి రైతుల సమస్యను పరిష్కరిస్తాం.

- రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

ఎటుచూసినా చెత్తకుప్పలే!

(ఐదో పేజీ తరువాయి)

చెత్తసేకరణను ప్రైవెట్ వ్యక్తులకు అప్పగించారు. ఇందుకుగానూ నెలకు రూ.50 చెల్లించే విధంగా ధరను నిర్ణయించారు. అనంతరం చెత్తను సేకరించే నిర్వాహకులే సేకరణ చార్జిని రూ.70కి పెంచారు. దాన్ని ఇటీవల రూ.100కు పెంచారు. గతంలో రెండు మూడురోజులకోసారి చెత్తను సేకరించేవారు. ప్రస్తుతం రూ.100 వసూలు చేస్తున్నా.. వారు నెలలో మూడు నాలుగుసార్లే వస్తున్నారు. మున్సిపల్ అధికారులు చెత్త సేకరణపై కనీస చర్యలు చేపట్టకపోవడంతో చెత్తసేకరణ నిర్వాహకులు ఆడిందేఆట పాడిందే పాటగా మారింది.

లోభించిన పారిశుధ్యం

ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్లు, జలవనరులు చెత్తతో నిండి పారిశుధ్యం లోపించింది. పరిసరాలు పూర్తిగా కలుషితమవుతున్నాయి. వాగుల్లో, కాల్వల్లో వేసిన చెత్త భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల్లోకి చేరుతోంది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లతో చెరువులు, కుంటలు నిండిపోతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తేరుకొని ప్రజలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌ను వివరణ కోరేందుకు పలుమార్లు పోన్ చేసినా ఆయన స్పందించలేదు.

కాలనీలో దుర్వాసన వస్తోంది



ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీలో రోడ్ల పక్కన చెత్తకుప్పలతో దుర్వాసన వస్తోంది. ప్లాస్టిక్ కవర్లు గాలికి చిందరవందర అవుతున్నాయి. జనాలు చెత్తను వీధుల్లో రోడ్లపై వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.

- మంజుల, గృహిణి, ఎన్ఎఫ్‌సీ నగర్

'ఆరోగ్య మహిళ'పై సూచనలు


కోట్‌పల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కోట్‌పల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంపై పలు సలహాలు సూచనలు ఇచ్చినట్లు ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిని పవిత్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీలకోసం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని డాక్టర్ మేఘనకు సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారిని డాక్టర్ నిరూష మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో నీటి సరఫరా ఎలా ఉందని ఏమైనా సమస్యలు ఉంటే డీఎంహెచ్‌వో కు, కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టు బిబిజాని, డాక్టర్ మేఘన, ఎమ్ఎల్ఎచ్‌పీ శ్రావణి, కృపావేని, ఏఎన్ఎం అపర్ణ, అంజలి, హేమలత, సిబ్బంది ఉన్నారు.

దైవ కార్యక్రమానికి వెళ్తుంటే అరెస్టులా?


ధారూరు: పోలీసుల అదుపులో నాయకులు

వికారాబాద్/ధారూరు/బొంరాస్‌పేట్/కోట్‌పల్లి/మర్పల్లి/కులకచర్ల/ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమానికి వెళితే అరెస్టులు చేయడం దారుణమని బీజేపీ నాయకులు అన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఇటీవల కూల్చిన పెద్దమ్మతల్లి ఆలయంలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించే కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు బీజేపీ నాయకులను పలువురిని హౌస్‌అరెస్ట్ చేసి పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి హానికరమని విమర్శించారు. అదేవిధంగా ధారూరులో బీజేపీ, హిందూ సంఘ నాయకులు ఎం.రమేశ్, రవీందర్ గౌడ్, రాజు గౌడ్, మహేశ్‌లను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బొంరాస్‌పేట్ మండలంలో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు బాబయ్యానాయుడు, శ్రావణ్‌గౌడ్, నర్సింహులు, ఉప్పరి జగదీశ్, జనార్ధన్, అనిల్‌సాగర్, రాజు తదితరులు ఉన్నారు. అదేవిధంగా కోట్‌పల్లిలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ ఇన్‌చార్జి కృష్ణయాదవ్‌లు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు సరికాదన్నారు. మర్పల్లిలో బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ హిందూ ఆలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగయ్య, లక్ష్మణ్, శ్రీధర్‌రెడ్డి, మధుకర్, శ్రీకాంత్, గోపాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కులకచర్లలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు జానకిరామ్, చంద్రలింగం, మైపాల్, అంజిలయ్య, శేఖర్‌లను అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఘట్‌కేసర్‌లో బీజేపీ, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులను మంగళవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో బీజేపీ నాయకుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్మిడి శోభారెడ్డి, దామోదర్‌రెడ్డి, అరవింద్ ఉన్నారు.

అధ్వానంగా రోడ్లు


హన్మ్యనాయక్ తండాకు వెళ్లే దారి

కులకచర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చెల్లాపూర్ బీటీ రోడ్డు నుంచి హన్మ్యనాయక్ తండాకు వెళ్లే రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షాలకు ప్రధాన మట్టి రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో నడుచుకుంటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అంబులెన్స్ కూడా రాని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.


బురదమయంగా మారిన మర్పల్లి కూరగాయల సంత

మర్పల్లి: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే కూరగాయల సంతకు మోమిన్‌పేట్, బంటారం, కోట్‌పల్లి, మర్పల్లి మండలాల పరిధిలోని గ్రామాల నుంచి రైతులు కూరగాయలు విక్రయించేందుకు వస్తుంటారు. కానీ వర్షాకాలం వచ్చిందంటే చాలు సంతలో మొత్తం బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇప్పటికైనా సంతలో సౌకర్యాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అబ్బో.. వాహనం ఎంత పొడవో!

కొడంగల్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అతి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను 138టైర్లు కలిగిన భారీ వాహనంలో మంగళవారం కొడంగల్ మీదుగా తీసుకెళ్లారు.ఈ భారీ వాహనాన్ని చూసిన అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు వాహనం ఎంత పొడవో అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలంలోని రుద్రారం ఇండస్ట్రియల్ ఏరియాలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ తయారవగా రాజస్థాన్‌లో ఓ కంపెనీకి దీన్ని తరలిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.



138 టైర్లు కలిగిన భారీ వాహనం

సంక్షిప్తంగా..

ఎమ్మెల్యేను కలిసిన కొత్త ఏపీఎంలు

పరిగి: పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిని మంగళవారం నియోజకవర్గంలోని సెర్ప్ ఏపీఎంలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే ఏపీఎం బదిలీలు జరిగి ఆయా మండలాలకు కొత్తగా జాయిన్ అయిన ఏపీఎంలంతా ఎమ్మెల్యేను సన్మానించారు. ఏపీఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రాజు, శోభ, బాలకృష్ణ, డీపీఎం నర్సింహులు కలిశారు. ఏపీఎంలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలి

దోమ: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని ఏపీఎం శోభ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా అర్హులైన మహిళలు, వృద్ధ మహిళలు, కిషోర బాలికలను, దివ్యాంగులను సంఘాల్లో చేర్పించడంపై గ్రామసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యమానాయక్, ఎంఈవో వెంకట్, గ్రామ సంఘం సభ్యులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

కీసర: ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో జమదగ్ని తెలిపారు. చీర్యాల్‌లో మంగళవారం జరిగిన బోధనోపకర మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చీర్యాల్ ప్రాథమిక పాఠశాలలో ప్రదర్శించిన బోధనోపకరణాలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కీసర: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కీసర స్పెషల్ అఫీసర్ పుష్పలత తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో మంగళవారం వందరోజుల కార్యాచరణలో భాగంగా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం కీసర ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

కులకచర్ల: ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక సెర్ప్ కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. హరిత మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, స్వయం సహాయక సంఘాల బలోపేతం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలంలో నూతన మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని, దివ్యాంగులు, వృద్ధులు, కిషోర బాలికల సంఘాలను ఈ నెల 30వరకు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎం నర్సింహులు, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంజనేయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

పెద్దేముల్: పెద్దేముల్ తండాలో వీరాంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు టీపీసీసీ ప్రధానకార్యదర్శి జాదవ్ ధారాసింగ్ అన్నారు. పెద్దేముల్ గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉన్న పెద్దేముల్ తండాలో ధారాసింగ్ నూతనంగా వీరాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 14 నుండి 15వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పూజలు హోమాలు నిర్వహించనున్నారు. ఈ రెండు రోజులపాటు మధ్యాహ్నం 1గంటలకు అన్నదాన వితరణ ఉంటుందని చెప్పారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ, నాభిశిల ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా గ్రామ మహిళలు ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు.

విద్యార్థులకు నవోదయ పుస్తకాలు అందజేత

కులకచర్ల: పీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ సర్పంచ్ రాధిక సోమలింగం నవోదయ పుస్తకాలను అందజేశారు. నవోదయ ఎంట్రెన్స్‌కు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు. నవోదయ సీట్లు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దుద్యాల ఆయుర్వేదిక్ వైద్యుడిగా సుశీల్‌కుమార్

దుద్యాల: దుద్యాల ఆయుర్వేదిక్ వైద్యుడిగా సుశీల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన వివిధ రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. పరిగిలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయరాం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హోంలోన్ భయంతో వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హోంలోన్ ఎలా చెల్లించాలనే భయంతో ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా లకనూరుకు చెందిన చిగురాల మణి(29)తో గత మార్చి 6వ తేదీన చిగురాల శివాణితో వివాహమైంది. వీరు పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలో ఉంటున్నారు. కాగా మణి 15రోజుల కిందట అన్నోజిగూడ ఇన్ఫోసిటీలో రెండవ అంతస్తులోని 204ప్లాట్‌ను కొనుగోలు చేసి అక్కడే నివాసముంటున్నారు. మణి ఓ ఫార్మాసీ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. అయితే హోంలోన్ ఎలా కట్టాలని మణి కొంతకాలంగా దిగులుగా ఉంటున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈనెల 8న వరలక్ష్మీవ్రతం ఉన్నందున అతడి భార్యను తల్లిదండ్రుల వద్ద దింపి తిరిగి ఇంటికి వచ్చాడు. 11న రాత్రి మణి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మృతుడి భార్యకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్లాట్ హోంలోన్ చెల్లించాలని ఎప్పుడు బాధపడుతుండేవాడని, దాని కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన మధు(50) మంగళవారం బైక్‌పై వెళ్తుండగా వివేకానంద చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి లారీకింద పడింది. దీంతో మధు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడిలో ఆవు, లేగదూడ..

చౌడాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో ఆవు, లేగదూడ మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన చౌడాపూర్ మండలంలో జరిగింది. మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన కృష్ణయ్య గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పశువుల పాకలో ఆవు, లేగదూడను కట్టేసి సోమవారం ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం పొలానికి వెళ్లి చూడగా ఆవు, లేగదూడపై వీధి కుక్కలు దాడి చేసి చంపినట్లు గుర్తించాడు. ఈ ఘటనలో దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఇందిరమ్మ ఇంటితో పేదల కల సాకారం


ఇళ్ల లబ్ధిదారులతో కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటితో పేదల కల సాకారమవుతుందని కాంగ్రెస్ నాయకులు రఫీయోద్దీన్ అన్నారు. కొంశెట్టిపల్లికి మొదటి విడత కింద 30 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో 15మంది లబ్ధిదారులు నెల రోజుల కిందట ఇంటి నిర్మాణం ప్రారంభించగా మొదటి దశ కింద వారి ఖాతాల్లో రూ.లక్ష జమయ్యాయని తెలిపారు. మంగళవారం లబ్ధిదారులతో కలిసి ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి డ్రా


డ్రా విధానం ద్వారా ఎంపిక చేస్తున్న అధికారులు

వికారాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్టీ పేద విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో 1వ తరగతి ప్రవేశానికి నాలుగు సీట్లకు డ్రా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సహాయ కలెక్టర్ ఎం.సుధీర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పి.కమలాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జి.సుందర్ రాజు, ఎస్.విక్రంసింగ్, జూనియర్ అసిస్టెంట్ ఏ.విజయ్‌కుమార్ పాల్గొనగా బాలికలు హర్షవర్ధిని సాయి అంగోత్ (బషీరాబాద్), విస్లావత్ ప్రతిక్ష (ధారూర్), బాలురు కట్రావత్ వైభవ్, పాత్లవత్ అభినందన్(చౌడాపూర్)లు ఎంపికయ్యారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి

నవాబుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సోదరభావంతో మెలగాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు గణపూరం శాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. రాఖీ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కావలి రాజు, మల్లేశం, ఫెరోజ్‌ఖాన్, దాన అనిల్‌కుమార్, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవన్గి ఎస్సీ కాలనీ సందర్శన

బషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవన్గి ఎస్సీకాలనీ వరద ముంపు ప్రాంతాన్ని మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశానుసారంగా అక్కడికి చేరుకోని ఎస్సీ కాలనీలో వరద ముంపునకు గల కారణాలపై ఆరా తీశారు. ఆరోగ్య ఉప కేంద్రం వద్ద పాటు కాల్వలను పూడిక తీయించారు. నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని గుర్తించారు. కుటుంబాలకు 10కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డి, తహసీల్దార్ షాహిదా బేగం, ఎంపీడీవో తిరుమల స్వామి ఉన్నారు.

పల్లెటూరి యువకుడికి పీహెచ్‌డీ పట్టా


పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న వెంకటప్ప

బషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన పాశమొల్ల వెంకటప్ప ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. ప్రొఫెసర్ కె.దీప్లా మార్గదర్శకంలో విద్య, క్రీడా రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తించి పీహెచ్‌డీని అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ క్రీడాకారుల శారీరక ఫిట్‌నెస్, శారీరక శాస్త్ర లక్షణాలపై ఎంపిక చేసిన శిక్షణ విధానాల ప్రభావం అంశంపై పరిశోధన పూర్తి చేసినట్లు ఈ మేరకు యూసీజీ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యాభ్యాస విభాగదిన్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, చైర్మన్ ప్రొఫెసర్ బి.సునీల్‌కుమార్‌లు వెంకటప్పను అభినందించారు.